టెలికామ్‌నగర్‌లో శోభాయాత్ర



రాయదుర్గం: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని సీతారాములు, ఆంజనేయ స్వామి ఉత్సవ మూర్తులతో టెలికామ్‌నగర్‌లో శోభాయాత్ర నిర్వహించారు. ఉదయం సాయి దత్త గణపతి ఆలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. శోభాయాత్రలో కాలనీవాసులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న విజయ్‌కుమార్‌

చందానగర్‌: చందానగర్‌లో హోప్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రంను ఫౌండేషన్‌ అధ్యక్షులు కొండ విజయ్‌కుమార్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చందానగర్‌ నుంచి వెళ్ళే ప్రయాణికులకు, విద్యార్థులకు దాహార్తి తీరుస్తాయన్నారు. కార్యక్రమంలో మార్వాడీ సమాజ్‌ సభ్యులు సునీల్‌, రాజేష్‌, హేమంత్‌ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి

రాజేంద్రనగర్‌: రాజేంద్రనగర్‌ సర్కిల్‌ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉప కమిషనర్‌ డాక్టర్‌ రవికుమార్‌ వెల్లడించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది ప్రజావాణి కార్యక్రమంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. సర్కిల్‌ పరిధిలోని ఐదు డివిజన్ల ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఈ కార్యక్రమానికి హాజరై విన్నవించాలని వెల్లడించారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



రాజేంద్రనగర్‌: కాలనీలు బస్తీల్లో ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ ఆరోగ్య సంరక్షణకు చర్యలు తీసుకోవాలని బుద్వేల్‌ మెథడిస్ట్‌ చర్చి పాస్టర్‌ అశోక్‌ కుమార్‌ అన్నారు. చర్చి ఆవరణలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 250 మంది వైద్య సేవలను పొందారు. శిబిరాన్ని ప్రారంభించిన పాస్టర్‌ అశోక్‌ కుమార్‌ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ఉచిత వైద్య శిబిరాలలో నిపుణులైన డాక్టర్ల బృందం వైద్య సేవలు అందిస్తారని.. ఈ వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని సూచించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

ఆస్తిపన్ను రాయితీ ఐదుశాతం.. 30 వరకు

రాజేంద్రనగర్‌: జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్‌ సర్కిల్‌ పరిధిలోని ఆస్తి పన్ను చెల్లింపుదారులు ఐదు శాతం రాయితీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉప కమిషనర్‌ డాక్టర్‌ రవికుమార్‌ సూచించారు. 2025–26వ సంవత్సరానికి గాను చెల్లించాల్సిన ఆస్తిపన్నుపై ప్రభుత్వం ఐదు శాతం రాయితీ అందిస్తుందన్నారు. ఈ రాయితీ ఈ నెల 30వ తేదీ వరకు ఉంటుందన్నారు. సర్కిల్‌ పరిధిలోని అత్తాపూర్‌, మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్‌, సులేమాన్‌నగర్‌, శాస్త్రీపురం డివిజన్లకు చెందిన ఆస్తిపన్ను చెల్లింపుదారులు తమ ఆస్తిపన్నును చెల్లించి రాయితీ పొందాలన్నారు. సర్కిల్‌ కార్యాలయంలో ఆస్తిపన్ను స్వీకరించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. అలాగే బిల్లు కలెక్టర్‌తో పాటు ట్యాక్స్‌ ఇన్‌స్పెక్టర్లు ఆయా ప్రాంతాల్లో రోజూ స్పెషల్‌ డ్రైవ్‌ చేపడుతున్నారన్నారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్టు

రాజేంద్రనగర్‌: బెల్టు షాపుపై ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి మద్యంతో పాటు ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని రాజేంద్రనగర్‌ పోలీసులకు అప్పగించారు. పోలీసుల సమాచారం మేరకు... బండ్లగూడ మల్లికార్జున్‌నగర్‌ ప్రాంతానికి చెందిన కె.వెంకటేశ్‌ కిరాణాషాపు నిర్వహిస్తున్నాడు. కొన్ని రోజులుగా మద్యాన్ని తీసుకొచ్చి షాపులోనే విక్రయిస్తున్నాడు. ఆదివారం డ్రైడే కావడంతో మద్యాన్ని విక్రయిస్తున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ పోలీసులు దుకాణంపై దాడి చేసి వెంకటేశ్‌ను అదుపులోకి తీసుకొని రాజేంద్రనగర్‌ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



మియాపూర్‌ ప్రశాంత్‌నగర్‌లో సీతారాముల కళ్యాణం



కొండాపూర్‌లో..



దీప్తిశ్రీనగర్‌లో.. ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌ శ్రీకాంత్‌



నల్లగండ్ల లక్ష్మీవిహార్‌లో ..

కమనీయం.. సీతారాముల కల్యాణం



రామలక్ష్మణుల వేషధారణలో చిన్నారులు



గచ్చిబౌలి డివిజన్‌లో..ఉత్సవాల్లో కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి

శేరిలింగంపల్లిజోన్‌ బృందం: శ్రీరామనవమి వేడుకలు ఆదివారం వాడవాడలా ఘనంగా జరిగాయి. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని కొండాపూర్‌, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్‌, మియాపూర్‌, హఫీజ్‌పేట్‌, మాదాపూర్‌ డివిజన్ల పరిధిలోని కాలనీలు, బస్తీలలో, ఆలయ ప్రాంగణాలలో ప్రత్యేకంగా కల్యాణ మండపాలను ఏర్పాటు చేసి పండితుల వేద మంత్రోచ్చారణల నడుమ సీతారాముల కల్యాణ ఘట్టాన్ని వైభవంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని రాములోరి కల్యాణాన్ని తిలకించి పులకించిపోయారు. ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. కాగా గేటెడ్‌ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లలోనూ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల అన్నదానాలు చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సెవెన్‌హిల్స్‌ కాలనీలో..

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్‌ డివిజన్‌ పరిధి సెవెన్‌హిల్స్‌ కాలనీలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరిగిన సీతారాముల కల్యాణానికి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్‌లు నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్‌, ఈఓ సత్యనారాయణ పాల్గొన్నారు. ఎమ్మెల్యే గాంధీ స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను అందజేశారు.



టెలికామ్‌నగర్‌లోని సాయిదత్తగణపతి ఆలయంలో సీతారాముల కల్యాణం



భెల్‌ ఎంఐజీ కాలనీలోని రామాలయంలో సీతారాముల కల్యాణం



చందానగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో..



ఆల్విన్‌కాలనీ: సెవెన్‌హిల్స్‌లో స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



మియాపూర్‌ డివిజన్‌లో వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్‌ నాయకుడు జగదీశ్వర్‌గౌడ్‌

రామాయణగాథ నృత్యరూపకం

మాదాపూర్‌: శ్రీరామనవమి సందర్భంగా శిల్పారామంలో ఆదివారం ప్రవీణ వాడపల్లి శిష్యబృందం శ్రీరాముని చరితము నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. దశరథ పుత్రకామేష్టి యాగం, విశ్వామిత్ర యాగం, రావణాసురుడి ప్రవేశం, సీత అపహరణం, హనుమంతుడి లంకదహనం, రామరావణ యుద్ధం , శ్రీరాముని పట్టాభిషేకం ఘట్టాలను ప్రదర్శించారు. కళాకారులు నందిని, శ్రేయ, అమూల్య, అనన్య, దీప్తి, అహనా, అనఘా, కాశ్వీ, స్వాతి, ఆద్య, ప్రియ, వర్షిణి, ధృవ, ప్రకృతి, రిషిక, అదితి, ఆర్య, శశి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇందిరా మహిళాశక్తి బజార్‌లో కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు.





సర్టిఫికెట్‌లు అందజేత



సర్టిఫికెట్‌లను అందజేసిన ఐటీ చీఫ్‌ సెక్రటరీ జయేశ్‌రంజన్‌

మాదాపూర్‌: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్‌ ఆర్ట్‌గ్యాలరీలో రెండురోజుల పాటు నిర్వహించిన కథక్‌ శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. పరిచయ్‌ ఆర్ట్స్‌ ఫౌండేషన్‌ అధ్వర్యంలో సాధన పేరిట నిర్వహించిన కథక్‌ శిక్షణ తరగతులను పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఐటీ చీఫ్‌ సెక్రటరీ జయేశ్‌రంజన్‌ సర్టిఫికెట్‌లను అందజేశారు.

ఆహ్వానపత్రిక అందజేత

రాజేంద్రనగర్‌: భారతరత్న డాక్టర్‌ బి.ఆర్‌.అంబేడ్కర్‌ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు రాజేంద్రనగర్‌ ఉత్సవ కమిటీ అధ్యక్షులు సూర్యం, కోశాధికారి సర్పంచ్‌ శ్రీను వెల్లడించారు. ఆదివారం రాజేంద్రనగర్‌కు చెందిన కిరోసిన్‌ రాజుకు ఆహ్వానపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడుతూ.. ఈ సంవత్సరం పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్‌



రణదివే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మల్లికార్జున్‌

పటాన్‌చెరు టౌన్‌: కార్మికుల ఐక్యత కోసం బీటీ రణదివే ఎనలేని కృషి చేశారని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్‌ పేర్కొన్నారు. రణధివే వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం పటాన్‌చెరు పట్టణంలోని శ్రామిక్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలోరణదివే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మల్లికార్జున్‌ మాట్లాడుతూ..1980లో భారతదేశంలో కార్మిక సంఘాలను ఏకతాటిపైకి తెచ్చారన్నారు.ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులను కార్పొరేట్‌ శక్తులకు అనుకూలంగా బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని, ఈ కుట్రలను తిప్పికొట్టాలని కార్మిక వర్గానికి పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి రాజయ్య, జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు, శాంతకుమార్‌, సురేష్‌కుమార్‌, రామచంద్రమూర్తి, సత్యనారాయణ, హరినాథ్‌ పాల్గొన్నారు.

భార్యపై దాడి.. భర్త రిమాండ్‌

గచ్చిబౌలి: ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యపై విచక్షణా రహితంగా సిమెంట్‌ బ్రిక్‌తో దాడి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గచ్చిబౌలి పోలీసులు తెలిపిన ప్రకారం.. వికారాబాద్‌ జిల్లా కోట్‌పల్లికి చెందిన మహ్మత్‌ బస్రత్‌(32) కోల్‌కత్తాకు చెందిన షబానా పర్వీన్‌(22)ను 2024 అక్టోబర్‌లో పెళ్లి చేసుకున్నాడు. హఫీజ్‌పేట్‌లోని ఆదిత్యనగర్‌లో నివాసం ఉంటున్నారు. బస్రత్‌ తల్లిదండ్రులతో పర్వీన్‌ తరచు గొడవ పడుతుండటంతో రెండు నెలల క్రితం వేరు కాపురం పెట్టాడు. కాగా పర్వీన్‌కు వాంతులవుతుండడంతో రాఘవేంద్ర కాలనీలోని సియాలైఫ్‌ హాస్పిటల్‌లో చేర్పించాడు. ఏప్రిల్‌1న రాత్రి 10 గంటలకు డిశ్చార్జి చేయగా బయటకు వచ్చి ఇద్దరు గొడవపడ్డాడు. కోపంతో బస్రత్‌ తన్నడంతో షబానా పర్వీన్‌ కిందపడి పోయింది. అక్కడ ఉన్న రెండు సిమెంట్‌ బ్రిక్‌లతో దాదాపు 15 సార్లు తల, శరీరంపై మోదాడు. చనిపోయిందనుకొని అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితురాలిని నిమ్స్‌ ఆస్పత్రికి తరలించగా అక్కడి చికిత్సపొందుతోంది. వైద్యులు నిర్వహించిన పరీక్షలలో మూడు నెలల గర్భిణి అని తేలిందని, షబానా ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ పతాకావిష్కరణ

రాయదుర్గం: భారతీయ జనతాపార్టీ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం గచ్చిబౌలి డివిజన్‌లో పలుచోట్ల పార్టీ పతాకావిష్కరణ చేశారు. రాయదుర్గం, నానక్‌రాంగూడలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పతాకావిష్కరణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ జిల్లా, నియోజకవర్గం, డివిజన్‌ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భెల్‌ ఎంఐజీ కాలనీలో..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి భెల్‌ ఎంఐజీ కాలనీలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తోపుగొండ మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జెండాను బూత్‌ అధ్యక్షురాలు రత్నకుమారి ఎగురవేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది గోవర్ధన్‌గౌడ్‌, జిల్లా అధికార ప్రతినిధి శాంతిభూషణ్‌ రెడ్డి, నాయకులు సుధారత్నం, దారం శ్రీనివాస్‌, జగదీష్‌ కుమార్‌, విజయ్‌ రాజ్‌, సుధాకర్‌ కుమార్‌, రఘురాం తదితరులు పాల్గొన్నారు.



భెల్‌ ఎంఐజీ కాలనీలో..



రాయదుర్గంలో జెండా ఎగురవేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు


చలివేంద్రం ప్రారంభం

మణికొండ: వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని, వాటిని విరివిగా ఏర్పాటు చేయాలని భారత్‌ వికాస్‌ పరిషత్‌ మణికొండ శాఖ అధ్యక్షుడు, ఎంప్లాయీస్‌ కాలనీ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు ఎం.పెంటారెడ్డి అన్నారు. నవ సేవా సంకల్ప ట్రస్ట్‌ వారు భాగ్యలక్ష్మి కాలనీ దుర్గామాత దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దప్పిక తీరిస్తే పుణ్యం వస్తుందన్నారు. మానవసేవే మాధవ సేవగా గుర్తించి సహాయం చేయాలన్నారు. ట్రస్ట్‌ సభ్యులు మణి, భాస్కర్‌, మహేష్‌కుమార్‌, విష్ణు, నర్సింగ్‌రావు, రాజేంద్రకుమార్‌, సుధ, రామకృష్ణ, సీనియర్‌ సిటిజన్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సుందర తటాకాలు


దుర్గం చెరువు, మల్కం చెరువులకు పెరుగుతున్న సందర్శకులు

గచ్చిబౌలి: నగర శివారులోని మాదాపూర్‌ దుర్గం చెరువు, రాయదుర్గం మల్కం చెరువులకు రోజురోజుకూ సందర్శకుల సంఖ్య పెరుగుతోంది. ఈ చెరువులను సీఎస్‌ఆర్‌ కింద ప్రైవేటు సంస్థలు జీహెచ్‌ఎంసీ సహకారంతో సుందరీకరించాయి. రెండింటిలోనూ వాకింగ్‌, సైక్లింగ్‌ట్రాక్‌లను ఏర్పాటు చేయడంతో వాకర్స్‌ సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. కాగా ఇక్కడ మురుగు వాసన వస్తోందని వాసన రాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.



మాదాపూర్‌లోని దుర్గంచెరువు పగటిపూట..

రాత్రి వేళ ..





రాయదుర్గంలోని మల్కంచెరువు పగటిపూట..

రాత్రివేళ ..

